క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థుల శ్రమదానం



మందగూడెంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు రాయపోల్ గ్రామ పరిధిలోని మందగూడెంలో గురువారం శ్రమదానంతోపాటు ఎయిడ్స్, పర్యావరణ పరిరక్షణ, పరసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్థానిక మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, జాతీయ సేవా విభాగం అధికారులైన డా.రమేశ్, రాకేష్ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

యాచారం: సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ప్రభుత్వాన్ని గురువారం ఓ ప్రకటనలో కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూనే ఎస్సీ, ఎస్టీ, జనరల్ అభ్యర్థులకు న్యాయం చేసేలా సర్కార్ దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక పంచాయతీల పాలన నిర్వీర్యం అయిందని తెలిపారు.

బీసీ బిల్లుపై గవర్నర్ ఆమోదం తెలపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యాచారం: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని గవర్నర్ ఆమోదం తెలిపేలా చూడాలని స్థానిక బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కార్ 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చూస్తుంటే గవర్నర్ ఆమోదం తెలపకపోగా బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



పెద్దతండాలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మాధురి

ఆమనగల్లు: మండలంలోని రాంనుంతల గ్రామ పరిధిలోని పెద్దతండా, గేటు తండాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఎంపీడీఓ మాధురి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాన్ని వేగంగా చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాన్ని బట్టి లబ్ధిదారులకు ప్రభుత్వం పేమెంట్ చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాలమల్లేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆనంద్, దర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అద్దంకిని కలిసిన నేత



అద్దంకి దయాకర్‌కి దరఖాస్తు అందజేసిన హన్మానాయక్

కడ్తాల్: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను మండల కేంద్రానికి చెందిన గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి తాను దరఖాస్తు చేసుకున్నానని, తన పేరును పరిగణనలోకి తీసుకోవాలని హన్మానాయక్ కోరారు. అనంతరం అద్దంకి దయాకర్‌కు దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. ఆయన వెంట జగన్‌నాయక్, జంగయ్య తదితరులు ఉన్నారు.





ఆక్టోపస్ వద్ద కొనసాగుతున్న రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు

వేగంగా విస్తరణ

- కొనసాగుతున్న ఆక్టోపస్–ఇబ్రహీంపట్నం డబుల్ రోడ్డు నిర్మాణ పనులు
- రూ.60 కోట్లతో 100 ఫీట్ల రహదారి ఏర్పాటు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇరుకైన గుంతల రోడ్డుకు మోక్షం లభించింది. ఇబ్రహీంపట్నం నుంచి ఆక్టోపస్ వరకు వెళ్లాలంటే గతంలో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఎన్నో ఏళ్ల నాటి కల సహకారం కాబోతుంది. పోల్కంపల్లి నుంచి నాగన్‌పల్లి వరకు రోడ్డు బాగుంది. కానీ ఆక్టోపస్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో ప్రభుత్వం ఈ రోడ్డు వెడల్పుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూ.60 కోట్లు వెచ్చించింది. ఆక్టోపస్ నుంచి ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా వరకు డబుల్ రోడ్డు వేయడానికి అంగీకరించింది. 15 రోజులు క్రితం పనులు ప్రారంభమవ్వగా.. ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. 100 ఫీట్ల వెడల్పుతో రహదారి వేయడానికి ఇప్పటికే ఫార్మేషన్ చేశారు. చకచక పనులు సాగుతున్నాయి.

మారనున్న రూపురేఖలు

ఆక్టోపస్ నుంచి ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా వరకు వంద ఫీట్ల రోడ్డు మధ్యలో డివైడర్ వేస్తే రూపురేఖలు మారనున్నాయి. గతంలో ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఇళ్లు రోడ్డు వెడల్పులో పోతాయంటే కొంత మంది ప్రజలు అంగీకరించలేదు. ప్రస్తుతం రోడ్డు వస్తే అభివృద్ధి అవుతుందని భావనతో సుముఖత వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లో భారీ ఎత్తున నిధులు కేటాయించి పనులు వేగంగా చేయిస్తున్నారు. రోడ్డు విస్తరణతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి.

ఎమ్మెల్యే చొరవతోనే



ఎమ్మెల్యే రంగారెడ్డి చొరవతోనే నాగన్‌పల్లి శివారు నుంచి ఇబ్రహీంపట్నం వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంతో కొంత మేర పనులు చేసి వదిలిపెట్టారు. ప్రస్తుతం రూ.60 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డు పూర్తి చేస్తే రక్షణ సంస్థలతో పాటు ఇబ్రహీంపట్నం అభివృద్ధి చెందుతుంది.

– లక్ష్మణరావు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు

వెతలు తీరుతాయి



ప్రతి రోజూ గుంతలు పడిన రోడ్డులో ఆటో నడుపుకొని జీవించడం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. రోజుకు రూ.1,000 సంపాదిస్తే ఆటో పాడైపోతే దానికే ఖర్చు పెట్టేవాణ్ని. గుంతలమయమైన రహదారితో ప్రమాదాలు సైతం సంభవించాయి. ప్రస్తుతం రోడ్డు విస్తరణ చేస్తున్నారు. పూర్తయితే రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది.

– రమేశ్, ఆటో డ్రైవర్

శబరిమలకు స్వాముల పాదయాత్ర

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్, కొత్తగూడెం గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు గురువారం శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా పిగ్లీపూర్‌లో అయ్యప్ప స్వామి మహాపడి నిర్వహించి శబరి కొండ అయ్యప్ప స్వామి దర్శనానికి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ యాత్ర 41రోజులు, 1,200 కిలోమీటర్లు స్వాములు కాలినడక చేయనున్నారు. బాటసింగారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు విష్ణుగౌడ్ స్వాములను శాలువలతో సన్మానించి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు యాదగిరి, మోహన్ రెడ్డి, హనుమంత్, వేణుచారి, సంజీవ్‌రెడ్డి, ప్రభాకర్, రవిచారి, శేఖర్‌గుప్తా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పడి పూజలో అయ్యప్ప స్వాములు, నాయకులు

బాధ్యతల స్వీకరణ



ఎంఈఓగా నిర్మల

కడ్తాల్: మండల విద్యాధికారిగా ముదీ్వన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న నిర్మల నియమితులయ్యారు. ప్రస్తుతం ఎంఈఓగా ఉన్న సత్యనారాయణ అనారోగ్య కారణాల రీత్యా తప్పుకున్నారు. గురువారం ఆర్జేడీ ఆదేశాల మేరకు నిర్మల ఏంఈఓ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్షురాలు పద్మ, ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, భీముడు, రవీందర్‌రెడ్డి, మల్లయ్య తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

కొందుర్గు: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం కొందుర్గు పోలీసుస్టేషన్‌లో ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ప్రజలు ముందుకొచ్చి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం దాతలను ఆయన అభినందించారు. అనంతరం పలు రకాల రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, షాద్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి



ఐక్యతను చాటుతున్న బీసీ సంఘాల నాయకులు

బీసీ సంఘాల నేతల పిలుపు

కడ్తాల్: రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్‌లను రక్షించుకోవడమే ధ్యేయంగా ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోల రాఘవేందర్, సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బీసీ సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలకు సంబంధించి 42 శాతం రిజర్వేషన్‌లను కోర్టులు నిలిపివేయడం తీరని అన్యాయమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అప్పీల్ చేసి, బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18న చేపట్టే బంద్‌కు బీసీ సంఘాలు, విద్యార్థులు, మేధావులు, రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలలో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతుందన్నారు. అంతకుముందు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. అనంతరం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తలకొండపల్లి మండలం వెల్జాలకు చెందిన విద్యార్థిని లక్ష్మి ప్రసన్నను ఎమ్మెల్యే పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు శ్రీనివాస్‌మూర్తి, రవీందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జగన్‌గౌడ్, యాదయ్యగౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పెండింగ్ బిల్లుల విడుదలకు సిఫార్సు చేయండి

కడ్తాల్: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న పెండింగ్ బిల్లులు ఇప్పించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డీజీపీ శివధర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు రాష్ట్ర పోలీస్ కార్యాలయంలో డీజీపీని కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు అప్పులు చేసి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, రూ.1,200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనేక నిరసనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మాజీ సభ్యుడు పత్యానాయక్, ముథోల్ మాజీ సర్పంచ్ రాజేందర్, నాయకులు గణేశ్ ఉన్నారు.



డీజీపీ శివధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమనగల్లు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పౌష్టికాహారం గురించి వివరించారు. సమావేశంలో రాధిక మాట్లాడుతూ.. పౌష్టికాహారం తినడంతో ఆరోగ్య సమస్యలు దరి చేరవన్నారు. ఆకుకూరలు తీసుకోవడంతో ఐరన్ సమృద్ధిగా లభిస్తుందన్నారు. చిరుధాన్యాలు, ఆయా సీజన్‌లలో లభించే పండ్లు ఎక్కువగా తినాలని సూచించారు. ఐసీడీఎస్‌ల ద్వారా అందించే బాలామృతంలో అనేక పోషక విలువలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి, నాగశిరోమణి, అలివేలు, సారమ్మ, రాములమ్మ, ముత్యాలమ్మ, భారతమ్మ, సువర్ణ, లక్ష్మి, సాలి, ఎమ్మార్పీ షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పోషక మాసోత్సవంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక

మహాసభలకు హాజరుకండి

గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 24, 25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అందించాలని కోరారు. రాష్ట్ర మహాసభలకు ప్రతి గ్రామం నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, యూనియన్ మండల అధ్యక్షుడు జంగయ్య, సభ్యులు పాండు, రాములు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పాండు

పోస్టర్ల ఆవిష్కరణ

ఈనెల 26, 27 తేదీల్లో ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మహాసభల పోస్టర్లను మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి పద్మ, సభ్యులు మంజుల, రమాదేవి, హేమలత, అంజమ్మ, లక్ష్మమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో భక్తిభావం పెంపు



పూజలో పాల్గొన్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం పెంపొందుతుందని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బాలాజీనగర్ తండాలోని రాందడియ దేవాలయ ప్రాంగణంలో హాథీరాం మహారాజ్ మఠం పరిరక్షణ కార్యక్రమానికి మద్దతుగా ఏర్పాటు చేసిన భోగ్ బండార్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రసిద్ధిగాంచిన ప్రాచీన గిరిజనుల ఆరాధ్యుడు హాథీరాం మహారాజ్ మఠానికి సంబంధించిన వివిధ వార్తల నేపథ్యంలో మఠం పరిరక్షణకు గిరిజనులు ఈ నెల 18న తిరుపతిలో తలపెట్టిన భోగ్ బండార్ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు బిచ్యానాయక్, నరేందర్‌నాయక్, శివాజీ, శ్రీరాములు, నాయకులు రాజు, రెడ్యా, జైపాల్, రమేశ్, రాము, పాండు, గణేశ్, బద్యా, ఐక్యత సభ్యులు రాఘవేందర్, మల్లేశ్, లింగం తదితరులు ఉన్నారు.

తీరిన విద్యుత్ సమస్య

కొందుర్గు: మండలంలోని ఆగిర్యాల సబ్‌స్టేషన్ నుంచి తంగెళ్లపల్లి గ్రామానికి నూతనంగా ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ లైన్ ఫీడర్‌ను గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. కొత్తలైన్ ఏర్పాటుకు అడిగిన వెంటనే రూ.35 లక్షలు మంజూరు చేసి పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఈ సందర్భంగా స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కాంగ్రెస్ నాయకుల సమావేశం

ఆమనగల్లు: మండల కేంద్రంలోని కల్యాణి గార్డెన్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి నియామకం కోసం కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి తమిళనాడు ఎంపీ రాబర్ట్ బ్రోస్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డిలు పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి నాలుగు మండలాల పరిధిలోని కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఓటు చోరీతోనే బీజేపీ అధికారం



సంతకాల సేకరణలో శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: ఓటు చోరీతోనే బీజేపీ దేశంలో మూడోసారి అధికారంలో వచ్చిందని పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. గురువారం మండలంలోని మైసిగండి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పరిశీలన కోసం ఫొటోలతో కూడిన మెషిన్ రీడబుల్ ఓటరు జాబితాను అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రతి ఎన్నికల ముందు తొలగింపు, చేర్పుల జాబితాను ఫొటోలతో సహ బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు. పేర్లను తప్పుగా తొలగించినట్లయితే అందుబాటులో ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. చివరి నిమిషంలో పేర్లను తొలగించడం, చేర్చడం అనే ప్రక్రియను నిలిపివేసి స్పష్టమైన కట్ ఆఫ్ తేదీని ముందే ప్రకటించాలన్నారు. క్రమబద్ధమైన ఓటర్ల జాబితా అనిచితవేతకు పాల్పడిన అధికారులు, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జవహర్ లాల్, హీరాసింగ్, తులసీరాం, కిషన్, శంకర్, రాము నాయక్, సుధీర్, జగన్, రమేశ్, నరేశ్, అమర్‌సింగ్, రాజు, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష రేసులో..

ఆమనగల్లు: కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్ష పదవి రేసులో కడ్తాల్ మండలం మైసిగండి గ్రామానికి చెందిన పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు. డీసీసీ పీఠం కోసం ఆయన తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలను కోరినట్లు సమాచారం. మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ స్థాయిలో శ్రీనివాస్‌గౌడ్ పనిచేశారు. 2006 నుంచి 2014 వరకు మైసిగండి ఎంపీటీసీగా, 2013 నుంచి ఆరేళ్ల పాటు ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏడేళ్ల పాటు పనిచేశారు. ప్రస్తుతం పీసీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.